
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 11 నవంబర్ 2022





డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరణ

నెల్లూరు : నగర డిఎస్‌పిగా డి. శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో నగర డిఎస్‌పిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేపట్టిన జె శ్రీనివాసులురెడ్డి స్థానంలో పూర్తిస్థాయిలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. 11 నెల నుంచి నగర డిఎస్‌పి పోస్టు ఖాళీగా ఉండటంతో ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి కింద ఉంది. నగర డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో నగరంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా డి. శ్రీనివాస్‌రెడ్డిని నగరంలోని పలు పోలీస్‌స్టేషన్ల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న డిఎస్‌పి

ఒక్కొక్కరికి ఒక్కో న్యాయం..!

ఇటీవల కాలంలో నేరాలకు కేంద్రంగా జిల్లా మారుతోంది. ఎటు వైపు చూసినా మోసాలు, రౌడీయిజం, హత్యలు, దోపిడీలు, దొంగతనాలు, పెరిగిపోతున్నాయి. మారుతోన్న పరిసిత్థుల నేపథ్యంలో నేరాలు కొత్త రూపాలు సంతరించుకుంటున్నాయి. ఈ కేసులను జిల్లా పోలీసులు వెంటనే ఛేదిస్తున్నారు. వారం, పది రోజుల్లోనే అరెస్ట్ చేసి, మీడియా ముందు ప్రవేశపెడుతున్నారు. డిఎం సివిల్ సప్లయ్ కార్యాలయంలో జరిగిన భారీ అవినీతి కేసులో మాత్రం పోలీసులు వింతగా వ్యవహరిస్తున్నారు. దీని వెనుక అధికార మంత్రం, రాజకీయ తంత్రం ఉన్నట్లు అనుమానాలు వస్తున్నాయి. జెసి కూర్మానాథ్ ఫిర్యాదు మేరకు 11 మందిపై కేసు పెట్టారు. సుమారు రూ.40 కోట్లు దోచుకున్నారు. మరో 21 మంది భాగస్వామ్యులున్నారని నివేదిక ఇచ్చారు. అక్టోబర్ 14న కేసు పెడితే ఇప్పటి వరకు కేవలం ఆరుగురిని మాత్రమే అరెస్ట్ చేశారు. ఇంత పెద్ద మోసగాళ్లను ఎవరికీ చూపించకుండా రిమాండ్‌కు తరలించారు. మిగిలిన వారు ఎప్పుడు వస్తారో తెలీదు. కేసును ఇప్పుడు ఎసిబికి అప్పగించారు. ఒక్కొక్కరికి ఓక్కోన్యాయంగా ఉంది. చట్టం పరిధిలో అందరూ సమానమైనా మోసం చేసిన అధికారులకు ఒక న్యాయం, సాధారణ జనాలకు మరో న్యాయమా అని ప్రశ్నిస్తున్నారు.

- కీలకమైన కేసులు ఛేదిస్తోన్న పోలీసులు
- మీడియా ముందు దొంగలు, రౌడీలు. హంతకులు
- సివిల్ సప్లయ్ కేసులో అంతా గోప్యం
- సామాన్యుడికి ఒక న్యాయం, అధికారులకు మరో న్యాయమా ?

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

పోలీసులకు ప్రతి కేసూ సవాల్‌గా మారుతోంది. ఇటీవల కాలంలో రౌడీలు, రాజకీయ నేతలు, ప్రధానంగా అధికారపార్టీ నేతల పక్కన చేరడంతో పోలీసులంటే భయం లేకుండా తయారయ్యింది. హత్యలు, బెదిరింపులు, షరా మామూలుగా మారాయి. పోలీసులు రౌడీలను పట్టుకుంటే అధికారపార్టీ నేతల ఒత్తిళ్ల కారణంగా వదిలేయాల్సి వస్తుందని తెలుస్తోంది. ఈ క్రమంలో జిల్లాలో హత్యలు జరుగుతున్నాయి. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో దొంగతనాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో రౌడీలపై ఉక్కుపాదం మోపడానికి సిద్ధమయ్యారు. ఇటీవల రౌడీ మేళాలు ఏర్పాటు చేసి, హెచ్చరికలు జారీ చేశారు. పిడి యాక్ట్ పెడతామని హెచ్చరించారు. ఇక్కడ జరిగే ప్రతి కేసూ పోలీసులు సవాల్‌గా తీసుకుంటున్నారు. పెద్ద పెద్ద కేసులను వారం, పదిరోజుల్లోనే అరెస్ట్ చూపిస్తున్నారు. నగరం లోని పడారుపల్లి వద్ద జరిగిన భార్యభర్తల హత్యను కేవలం నాలుగు రోజుల్లోనే ఛేదించారు. హంతకులను మీడియా సమావేశం ప్రవేశపెట్టి అరెస్ట్ చేసి, జైలుకు పంపారు. జిల్లా వ్యాపితంగా లోన్‌యాప్‌ల ద్వార సామాన్య, మధ్య తరగతి ప్రజలను మోసం చేస్తున్న గ్యాంగ్‌ను చాకచక్యం పట్టుకొని, ఇతర రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి మీడియా ముందు పెట్టి అరెస్ట్ చూపించారు. నగరంలో జరిగిన అనేక పెద్ద పెద్ద దొంగతనాలను ఛేదించారు. చిన్నబాజర్‌లో చేసిన దోపిడీ, పొగతోటలో డాక్టర్ ఇంట్లో భారీ దొంగతనంలో దొంగలను అరెస్ట్ చేశారు. ఇటీవల హరిత హోటల్ వద్ద హత్యకు గురైన రౌడీ షీటర్ గిరీష్ హత్య కేసును ఛేదించి 13 మంది రౌడీ మూకలనుఅరెస్ట్ చేసి, మీడియా ముందు ప్రవేశపెట్టారు. నగరంలో ఇటీవల రౌడీ షీటర్లు హత్యలు పెరిగాయి. అందుకు గతంలో చేసిన హత్యలే కారణంగా పోలీసులు గుర్తించారు. ప్రతి కేసునూ పోలీసులు ఛేదిస్తున్నారు. చైన్ దొంగలు, మోసగాళ్లు, హంతకులు, అందరినీ అరెస్ట్ చేసి,


కొడవలూరు మండలంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారంటూ ఓ యువకుడిని అరెస్టు చేసి చూపుతున్న పోలీసులు (ఫైల్)

మీడియా సమావేశం ఏర్పాటు చేసి, కోర్టులో హాజరు పరిచి జైలుకు పంపుతున్నారు. ఇందులో పోలీసులను అబి . నందించాల్సిందే. నేరాలు జరగకుండా అరికట్టడంలో విఫలమైనా, జరిగిన తరువాత నేరస్తులను అరెస్ట్ చేయడంలో బాగపనిచేస్తున్నారని పేరుంది.

సివిల్ సప్లయ్ అధికారులకు ప్రత్యేక న్యాయమా..?

సివిల్ సప్లయ్ డిఎం కార్యాలయంలో జరిగిన అవినీతి కేసును పోలీసులు ఛేదించడంలో నిర్లక్ష్యం కనిపించింది. అధికారుల ఒత్తిడా, రాజకీయ నేతల ఆదేశాల అనే అనుమానం వస్తుంది. ఈ కేసు అక్టోబర్ 14న కేసు పెట్టారు. ప్రజల సొమ్మును సుమారు రూ.40 కోట్లు అధికారులు, ఉద్యోగులు, ప్రవేటు వ్యక్తులు దోచుకుతిన్నారు. కళ్ల ముందు ఆస్తులు కూడబెట్టుకున్నారు. ఇలాంటి కేసులో పోలీసులు వెంటనే స్పందించాల్సి ఉంది. 11 మందిపై కేసులు పెడితే 25 రోజుల తరువాత ఆరుగురిని అరెస్ట్ చేశారు. జెసి విచారణ జరుగుతోన్న నేపథ్యంలో పోలీసులు జోక్యం చేసుకోకపోవడంతో స్థిర ఆస్తుల మినహా బంగారు, డబ్బు దారిమళ్లిందనే విమర్శలు న్నాయి. డిఎం పద్మ, శర్మ, మరో అధికారి, శివకుమార్, పవన్, రాజు ఆరుగురును అరెస్ట్ చేశారు. కోట్లాది రూపాయలు దిగమింగిన వారిని కనీసం మీడియాకు చూపించకుండా గట్టుచప్పుడు కాకుండా కోర్టుకు పెట్టి, జైలుకు పంపారు. మీడియా తెలుసుకొని రాస్తే తప్ప, కనీసం చెప్పలేదు. ఇంత పెద్ద కేసులో మీడియా ముందుకు తీసుకురాలేదు. మరో ఐదుగురు అరెస్ట్ చేయాల్సి ఉంది. ఇవి కాకుండా మరో 21 మంది అధికారులు, ప్రయివేటు వ్యక్తులు, ఉద్యోగులు ఉన్నారు. కేసు పెట్టిన వెంటనే పోలీసులు రంగంలో దిగి ఉంటే ప్రభుత్వ సొమ్ము కొంతైనా దొరికేది. జెసి విచారణలో తేలిన విషయాలు తప్ప పోలీసు విచారణలో జరిగింది ఏమీ లేదు. రాష్ట్ర ఎసిబి అధికారుల ఆదేశాల మేరకు ఈనెల 6 వతేదీ ఎసిబి అధికారులకు అప్పగించారు. దొంగలు పడ్డ ఆరు నెలలకు...అన్నట్లు ఎసిబి అధికారులు బుధవారం దాడులు నిర్వహించి చిల్లర పట్టుకున్నారు. నెల రోజుల వరకు వారి ఇళ్లపై దాడులు నిర్వహించకుంటే ఇళ్లలో బంగారు, నగలు, ఆస్తులు పోలీసుల కోసం ఉంచి పెడతారా; ఇళ్లు తప్ప మిగిలిన ఆస్తులు దారిమళ్లినట్లు తెలుస్తోంది. ఈ కేసులో కీలకంగా ఉన్న 21 మంది అధికారులు హాయిగా తిరుగుతున్నారు. ఆస్తులను దారి మళ్లించారు. సామాన్యుడికి ఒక న్యాయం, అధికారులకు మరో న్యాయమా ? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎసిబి ఇప్పుడు ఈ కేసును ఏం చేస్తుందో, ఎంత రికవరీ చేస్తుందో చూడాలి.

ఉచిత ఇసుక కూపన్ల నయా స్కాం..!

జగనన్న లే అవుట్ల పేరుతో ఉచిత ఇసుక పక్కదారి..
లక్షలు గడిస్తున్న కాంట్రాక్టర్లు...
అధికారులు, నాయకుల వాటా ఎంత?


ఇళ్ల నిర్మాణాల దృశ్యం

పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న లే అవుట్‌లలో అక్రమాల చోటు చేసుకుంటున్నాయి.ప్రభుత్వ నిర్మాణాలు జగనన్న ఇళ్ల నిర్మాణాలకు ఇసుక ఉచితంగా తరలించాలని ప్రభుత్వ ఆదేశాలను కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు సొమ్ము చేసుకుంటున్నారు..ఇసుక ధరలు అధికంగా పెరిగి పోవడంతో ఇసుక దోపిడీ దారులతో అధికారులు, కాంట్రాక్టర్లు సైతం కుమ్మక్కై ఉచిత ఇసుకను దారి మళ్లించి లక్షలు గడిస్తున్నారు. ఇది మండలంలోని జగనన్న లే అవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్ల తీరు...వీరిని అడిగేవారు లేరని ఇష్టా రాజ్యంగా ఎవరికీ తెలియదు లే అన్నట్లు ఉచిత ఇసుకను అమ్ముకుంటూ లక్షలు గడిస్తున్నారు. ఉచిత ఇసుక ఇలా..

ప్రజాశక్తి- బుచ్చిరెడ్డిపాలెం

జగనన్న లే అవుట్ లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారికి ప్రభుత్వం గహ నిర్మాణ సంస్థ ద్వారా గ్రామంలోని సచివాలయంకు చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఒక్కొక్క ఇంటికి నాలుగు ఉచిత ఇసుకకు సంబంధించిన కూపన్లు అందజేస్తారు.ఆ కూపన్లు ఇళ్ల నిర్మాణాలు చేపట్టే కాంట్రాక్టులు తీసుకొని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుకను ఇసుక రీచ్ నుంచి ఎటువంటి నగదు లేకుండా ఉచితంగా తరలిస్తారు. సుమారు ఇరవై టన్నుల ఇసుక ఒక ఇంటి నిర్మాణానికి అందిస్తారు.మండలం మొత్తం ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు కాబట్టి నెలకు వందల సంఖ్యలో కూపన్లు అందజేస్తారు.

మార్కెట్లో అమ్మకానికి ఉచిత ఇసుక కూపన్లు...

ఒక్కొక్క కాంట్రాక్టర్ 20 నుంచి 50, 100 ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకువచ్చి నిర్మాణాలు ప్రారంభించారు. నిర్మాణాలు చేపట్టిన నాటి నుంచి ఒక్కరు ఇద్దరు కాంట్రాక్టర్లు మినహా మండలంలో ఎక్కడ పట్టిన ఉచిత ఇసుక కూపన్లు అమ్మకానికి పెట్టారు.ఒక ఇసుక ట్రాక్టర్ ఇసుక రీచ్ లో లోడింగ్‌కి 2,200 రూపాయలు అవుతుంది.ఆ ట్రాక్టర్ యజమానికి దానిని దూరాన్ని బట్టి ఇసుకను వినియోగ దారునికి అమ్ముకుంటారు.మినగల్లు ఇసుక రీచ్ నుంచి బుచ్చిరెడ్డి పాలెంకు రూ.4వేల నుంచి రూ.5వేలకు అందిస్తారు. డిమాండ్‌ను బట్టి ఏమి మరి రెట్టింపు జరుగుతుంది. మార్కెట్లో ఉచిత ఇసుక కూపన్లు రూ.1500 నుంచి రూ.2వేలకు దొరుకుతున్నాయి.అలా ఎన్ని కూపన్లు కావాలన్నా ఇచ్చేందుకు గుత్తేదారులు సిద్ధంగా ఉన్నారని సమాచారం. అసలు అన్ని కూపన్లు ఎవరు ఇస్తున్నారు ఎలా ఇస్తున్నారు అసలు ఏమి జరుగుతుంది అనేది చిదంబర రహస్యం.ఆ కూపన్లతో ఇసుక ఉచితంగా తీసుకొని మార్కెట్లో మామూలు ధరకే అమ్ముకుం టున్నారు. ఒక కూపన్ ద్వారా కాంట్రాక్టర్లు రూ.2వేలు వసూలు చేస్తే అలా రోజుకి మండలం మొత్తమ్మీద వందల సంఖ్యలో ఉచిత ఇసుక కూపన్ల ద్వారా లక్షలు గడిస్తున్నారు. దోపిడీదారులు..ఇలా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే లోపల కాంట్రాక్టర్‌లు చాలా రాళ్లు వెనకేసు కుంటున్నారు. ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతుందని, వారికి కూడా ఈ దోపిడీలో వాటా ఉందని ప్రజలు అనుకుంటున్నారు.

మరి పేదల ఇళ్లకు...

ఒక్కొక్క పేద వారి ఇంటి నిర్మాణానికి నాలుగు ఉచిత ఇసుక కూపన్లు అందజేస్తుంది ప్రభుత్వం. ఇలా కూపన్లను కాంట్రాక్టర్లు అడ్డుగోలుగా అమ్మేస్తుంటే మరి ఇళ్ల నిర్మాణాలకు ఇసుక ఎలా చేస్తున్నారు అనేది వంద కోట్ల ప్రశ్న. నాసిరకంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారా అని సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల్లో లేక సచివాలయం ఉద్యోగులతో కలిసి నిర్మాణాలు చేపట్టని వాటికి కూడా ముందే ఇస్తున్నారా అనేది అర్థం కావడం లేదు. కూపన్లు పక్క దారి పడుతుంటే ఇళ్ల నిర్మాణంకు ఇసుక ఎక్కడ నుంచి వచ్చి చేరుతుంది. ఇదంతా కాంట్రాక్టర్ల మాయజాలమా అనిపిస్తుందని పలువురు అను కుంటున్నారు. ఇది ఇలానే కొనసాగితే జగనన్న లే అవుట్లకు గండి పడే అవకాశం త్వరలో ఉందని తెలుస్తోంది.



విద్యా సంస్థల యాజమాన్యాలకు అవగాహన

కందుకూరు : కందుకూరు మోటారు వాహనాల తనిఖీ అధికారి వారి కార్యాలయంలో గురువారం పట్టణ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల విద్యాసంస్థల యాజమాన్యాలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మోటారు వాహనాల తనిఖీ అధికారి ఎస్‌కెఎమ్‌డి రఫీ మాట్లాడుతూ విద్యా సంస్థల వాహనాలకు సంబంధించిన పత్రాలు చెల్లుబాటులో ఉండే విధముగా చూసుకోవాలన్నారు. విద్యార్థులు వాహనాలు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు సంబంధిత డ్రైవర్ జాగ్రత్తగా గమనించి జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.


మాట్లాడుతున్న వాహనాల తనిఖీ అధికారి రఫీ

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరేందుకు మూడో విడత అడ్మిషన్ల కోసం ఈ నెల 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కళాశాల ప్రిన్సిపాల్ ఎం. రవి కుమార్ తెలిపారు. వివరాలకు 9440221228, 9885398524 సంప్రదించాలని కోరారు.

పేదలకు ఆహారం పంపిణీ

కందుకూరు : శ్రీరామ సాయి బాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆత్మకూరి నవీన్ కుమార్, హేమలత దంప తులు పెళ్లిరోజు సందర్భంగా వారి సహకారంతో పేదలకు ఆహారం, పండ్లు పంపిణీ చేశారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ రవ్వా అరుణ పాల్గొన్నారు.

విరాళం అందజేత

కందుకూరు : అంకమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం కోసం ఎంఎల్‌ఎ ఎం మహీధర్‌రెడ్డి కృషి చేస్తున్నారు. ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గురువారం కందుల నాగబ్రహ్మేంద్రస్వామి భార్య శారద కుమారులు దత్త సాయి మణికంఠ కోడలు నవీన జ్ఞానేశ్వర రూ .25116లు విరాళంగా అందజేశారు.ఎనిమిరెడ్డి వెంకటరెడ్డి, ఆలయఅర్చకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుడ్లూరు : ముందు వైపు వెళుతున్న లారీని ఓవర్ టాక్ చేయబోయి కారు లారీని ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన గుడ్లూరు మండలం, మాచర్ల -వీరేపల్లి మధ్యలో జాతీయ రహదారిపై గురువారం వేకువజామున జరిగింది. గాయపడిన వారిని 108 ద్వారా కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు.అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చెన్నై నుంచి విజయవాడకు వెళుతున్న లారీని మోచర్ల దగ్గరకు రాగానే పాండిచ్చేరి నుంచి గుంటూరుకు కారులో బయలుదేరిన నవీన్, కావ్య కార్ డ్రైవర్ మహబూబ్ బాషా లారీని ఓవర్ టాక్ చేయబోయి ప్రమాదవశాత్తు లారీ వెనుక వైపున ఢీకొట్టారు. దీంతో ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. కారులో ప్రయాణిస్తున్న వారికి బలమైన గాయాలు తగలడంతో హైవే మొబైల్ పోలీసులు వారిని కారులో నుంచి బయటకు తీసి 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రసాద్ రెడ్డి తెలిపారు.

డిగ్రీ ఫలితాల్లో 'కష్ణచైతన్య' విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు : విక్రమ సింహపురి యూనివర్శిటి విడుదల చేసిన 1వ సెమిస్టర్ ఫలితాల్లో కష్ణచైతన్య కళాశాల విద్యార్థులు అన్ని కోర్సులు, గ్రూపుల్లోనూ విశేష ప్రతిభ కనబరిచారు. యూనివర్శిటీ స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి విజయ దుంధుభి మ్రోగించారనిఆ కళాశాల డైరెక్టర్లు డాక్టర్ ఆర్.వి.కష్ణారెడ్డి, పి. చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ విద్యార్థులు బిఎస్‌సి, బి.కాం., బి.బి.ఎ, , బి.సిఎ గ్రూపుల్లో 1వ సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఆ విద్యార్థుల వివరాలను వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులకు పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు. డీన్ బి.సుధారాణి, అడ్మిన్ డీన్ సి.రామాంజనేయులురెడ్డి, ప్రిన్సిపల్ ఎస్ నాగయ్య, వైస్.ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

యాచకులకు ప్లేట్లు పంపిణీ

కందుకూరు : కందుకూరు డివిజన్ జీవనజ్యోతి దివ్యాంగ వికాస సేవా సమితి ఆధ్వర్యంలో యాచకులకు గురువారం ప్లేట్లు పంపిణీ చేశారు. సేవాసమితి కార్యదర్శి శీలం వెంకటేష్ మాట్లాడుతూ దాతల సహకారంతోకోవూరు రోడ్డులోని శ్రీ షిరిడి సాయిబాబా దేవస్థానం వద్ద ఉన్న యాచకులకు ప్లేట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అధ్యక్షుడు చనమాల శ్రీనివాసరావు, అరుణ వెంకటేష్, ప్రేమ్ బాబు, విశ్వసంభవ్, చందన్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవం

ఉలవపాడు : ఉలవపాడులో గురువారం జి.వి.ఎస్. ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి. లక్ష్మీ సుధారాణి అధ్యక్షతన ఇంటర్నేషనల్ అకౌంటింగ్ డే ను ఘనంగా నిర్వహించారు. వాణిజ్య శాస్త్ర విభాగం అధ్యాపకురాలు హరిత , ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎంత ఉన్నత చదువులు చదివినా ఆర్థిక పరమైన అంశాల్లో వెనుకబడి ఉంటారని, అందువల్ల మీరు విద్యార్థి దశ నుంచే ఆర్థిక అక్షరాస్యతను పెం పొందించుకోవాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

14న భారీ బహిరంగ సభ : టిడిపి

అమరావతికి మద్దతుగా

నెల్లూరు : సింహపురి నడిబొడ్డున అమరావతికి మద్దతుగా టిడిపి నాయకులు శంఖారావం పూరించనున్నారు. వాతావరణం అనుకూలిస్తే ఈనెల14న సాయంత్రం 3 గంటలకు నగరంలోని నర్తకీ సెంటర్‌లో భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు టిడిపి నాయకులు ప్రకటించారు. గురువారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో రూరల్, సిటీ నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హాజరై మాట్లాడారు. రాజధానిగా అమరావతి ఎంపిక ఏకగ్రీవ నిర్ణయమన్నారు. అప్పట్లో సిఎంగా చంద్రబాబు నాయుడు ప్రతిపాదిస్తే వైసిపి, బిజేపి, వామపక్ష పార్టీల నేతలు ఏకగ్రీవంగా మద్దతు తెలిపారన్నారు. అమరావతిలో రాష్ట్ర రాజధాని నిర్మాణ పనులకు సాక్షాత్తు ప్రధాని నరేంద్రమోడి హాజరైయ్యారన్నారు. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి, ప్రతిపక్షనేత, రెండు చట్టసభలు ఆమోదించిన రాజధానికి ఇబ్బందులు ఉండవని ఆ ప్రాంత ప్రజలు గట్టిగా నమ్మారన్నారు. ఈ రోజు గర్జిస్తున్న వైసిపి నేతలు ఆ రోజు ఎందుకు నోరు తెరవకుండా చప్పట్లు కొట్టారని ప్రశ్నించారు.నెల్లూరుకు అమరావతి 270 కిలోమీటర్లు, విశాఖ 670 కిలోమీటర్లలో ఉంటుందని, అయితే అధికార పార్టీ నాయకులేమో 270 కిలోమీటర్లు వద్దు..670 కిలోమీటర్లే ముద్దు అంటున్నారని ఎద్దేవా చేశారు. నెల్లూరులో చేపట్టబోతున్న కార్యక్రమానికి జిల్లా ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపు నిచ్చారు. అనంతరం టిడిపి రూరల్ నియోజకవర్గం నాయకులు అబ్దుల్ అజీజ్ , టిడిపి నగర ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి మాట్లాడారు. మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, రాష్ట్ర కార్యదర్శి జెన్నీ రమణయ్య, జాఫర్ షరీఫ్, నావురు శైలేంద్ర బాబు, మేకల రామ్మూర్తి, దొడ్డపనేని రాజా నాయుడు, సాబీర్ ఖాన్, పిట్టి సత్యనాగేశ్వర రావు, ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్, జహీర్, కువ్వరపు బాలాజీ, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

యువజనోత్సవాలకు దరఖాస్తులు ఆహ్వానం

వలేటివారిపాలెం : జిల్లా స్థాయిలో జిల్లా యువజన సంక్షేమ శాఖ, సెట్నెల్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ షేక్ రఫీక్ అహ్మద్ గురువారం తెలిపారు. జాతీయస్థాయిలో శాస్త్రీయ గాత్ర సంగీతం, నృత్యము, వాయిద్య పరికరములు, రాష్ట్ర స్థాయిలో వకృత్వం, క్విజ్, సాంగ్, డ్యాన్స్, మ్యూజిక్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనేవారు 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసు వారై ఉండాలన్నారు. వయసు ధృవీకరణకు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు నకలు తీసుకు రావాలన్నారు. వివరాలకు 9849913074, 9491652138 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

విద్యుత్ బిల్లులు చెల్లించాలి : ఎఇ

వలేటివారిపాలెం : విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సహ కరించాలని మండల ఎఇ మధుబాబు గురువారం ప్రకటనలో కోరారు. వినియోగదారులకు ఇచ్చిన పదిహేను రోజులలోపు సచివాలయాల్లో, ఫోన్‌పే, గూగుల్‌పే, పేటిఎం తమ శాఖ వెబ్‌సైట్ ద్వారా చెల్లించొచ్చని తెలిపారు.

ఆరోగ్య కేంద్రం ప్రారంభం

నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని పేద ప్రజలందరికీ అత్యాధునిక వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా "పట్టణ ఆరోగ్య కేంద్రాల" నిర్మాణం జరుగుతోందని మాజీ మంత్రి, నగర శాసన సభ్యులు డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్ వెల్లడించారు. స్థానిక 44 వ డివిజన్ కలెక్టరేట్ సమీపంలో నూతనంగా నగర పాలక సంస్థ నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీమతి హరిత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పెంచలయ్య, నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు నీలి రాఘవ రావు, పోట్లూరి రామకష్ణ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించని అధికారులు

కందుకూరు : గ్రామాల అభివృద్ధికి అధికారులు సహకరించడం లేదని మండలంలోని కొండి కందుకూరు సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివద్ధి జరగాలంటే గ్రామాలు అభివద్ధి జరగాలని సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి నమ్ముతారన్నారు. వారి ఆశయాలకు ప్రభుత్వ అధికారులు నీళ్లు చల్లుతున్నారన్నారు.ప్రతిష్టాత్మకంగా గడప గడపకు మన ప్రభుత్వం చేపట్టిందని, ఆ కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎ ఎం మహీధర్‌రెడ్డి విజయవంతం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఆ కార్యక్రమంలో సమస్యల పరిష్కారంలో అధికారులు సర్పంచ్‌లకు సహకారం అందించాలని పదేపదే చెప్పారన్నారు. అయితే అధికారులు సర్పంచులకు ఎందు ప్రాధాన్యత ఇవ్వటం లేదని ప్రశ్నించారు. ఎంఎల్‌ఎ దృష్టికి అవాస్తవాలను తీసుకెళ్లి తప్పించుకుంటున్నారన్నారు. ఎవరు ఎన్ని చెప్పినా ఎంఎల్‌ఎ ప్రజల సమస్యలు పరిష్కరించడంపైనే దృష్టిసారిస్తారే తప్ప వెనుకడుగు వేయరని చెప్పారు.

అక్షర చెతన్యం -2పై శిక్షణ

ఉలవపాడు : కలెక్టర్ చక్రదర్ బాబు, జిల్లా పంచాయతీ అధికారి ఎం ధనలక్ష్మి ఆదేశాలమేరకు గురువారం ఎంపిడిఒ ఎల్ చెంచులక్ష్మి ఆధ్వర్యంలో మండల కార్యాలయం లో అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్వైజర్ రవీంద్రనాథ్ రెడ్డి సమక్షంలో అక్షర చెతన్యం -2పై శిక్షణ జరిగింది. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు, మహిళా శిశు సంక్షేమ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు.

వ్యక్తి ఆత్మహత్య

కందుకూరు : పట్టణంలోని శివాలయం వద్ద లింగసముద్రంకు చెంది దాసరి వెంకటేశ్వర్లు (53) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గురువారం గుర్తించారు. లింగసముద్రం నుంచి రోజు కూలి పనులు కోసం కందుకూరుకు వచ్చి పోతుంటాడు. వెంకటేశ్వర్లు బుధవారం రాత్రి ఇంటికి వెళ్లలేదు. శివాలయం వద్ద చనిపోయి ఉన్న వ్యక్తి గురించి ఆరా తీయగా దాసరి వెంకటేశ్వర్లుగా గుర్తించారు. పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు కేసు నమోదు చేశారు.ఏరియా వైద్యశాలకు మృతదేహాన్ని తరలించారు.

క్షేత్ర సందర్శనలో 'ప్రకాశం' విద్యార్థులు

కందుకూరు : క్షేత్ర సందర్శనలు, వర్క్ షాపుల నిర్వహణ ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల విజయానికి మూల కారణమని విద్యార్థులు చెబుతున్నారు. ఎలక్ట్రికల్ విద్యార్థులు కందు కూరులోని కేంద్ర పొగాకు పరిశోధన కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా వారి అనుభవాలను గురువారం సహచర విద్యార్థులతో పంచుకున్నారని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య పేర్కొన్నారు. వ్యవసాయంలో మూలాధారమైన నాణ్యమైన విత్తనాల తయారీ,నర్సరీ పెంపకం అంతర పంటల సాగు అంశాలను శాస్త్రవేత్తలు తమకు ప్రత్యక్షంగా క్షేత్రంలో చూపించారని సీనియర్ విద్యార్థులు అఖిల్,స్పందన ఫస్ట్ ఇయర్ విద్యార్థులు కావేరి, మణికుమారిలు వివరించారు. వివిధ వ్యవసాయ పరికరాల వినియోగాన్ని ప్రయోగా త్మకంగా చూపించారని వారు చెప్పారు. వర్షపు నీటి నిల్వల పొదుపు ప్రక్రియకు సిటిఆర్‌ఐలో ఏర్పాటు చేసిన కొలనులు, సోలార్ పంపింగ్ విధానం అధికారులు చేసి చూపించారని విద్యార్థులు వివరించారు. కషి విజ్ఞాన కేంద్రంలో కూడా అధికారులు వివిధ కార్యక్రమాలను తిలకింప చేశారన్నారు. ఇటువంటి క్షేత్ర ప్రదర్శనలు విద్యార్థులకు సామాజిక అవగాహన పెంపొం దిస్తాయని కాలేజీ అకడమిక్ ఇన్‌ఛార్జి ఎస్.ఎం. మీరావాలి తెలిపారు.. సిటిఆర్ఐ ఇన్ ఛార్జ్ అనురాధ తమ విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహానిచ్చారని ఆయన కతజ్ఞతలు తెలిపారు.


ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

ఫ్లైఓవర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

నెల్లూరు : 16వ డివిజన్ సిపిఎం నాయకులు ఆర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఫ్లైఓవర్ సాధన కమిటీ సభ్యులు, సిపిఎం నాయకులు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని గురువారం ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశారు. చింతారెడ్డి పాళెం జంక్షన్ ప్రాంతంలో బైపాస్‌రోడ్డు వద్ద ఫ్లైఓవర్ నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడాలంటూ కోరారు. చింతా రెడ్డిపాలెం జంక్షన్ వద్ద గల ఫ్లైఓవర్ని వెంటనే పూర్తిచేసి ప్రజలకు అందించాలని ఇప్పటికే ఈ ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అనేకమంది ప్రాణాలు కోల్పోయారని నాయకులు గుర్తు చేశారు. ఎంఎల్‌ఎ శ్రీధర్ రెడ్డి స్పందిస్తూ ప్రాంతంలో బ్రిడ్జి చాలా అవసరమని ఎందరో ప్రాణాలు కోల్పోయేది వాస్తవమన్నారు. అక్కడ బ్రిడ్జి కోసం తన శక్తి వంచన లేకుండా కృషిచేస్తానన్నారు. సమస్యను అధికారుల దష్టికి తీసుకెళ్తానన్నారు. రైతు సంఘం నాయకులు కోటిరెడ్డి సింగారెడ్డి మధుసూదన్ రెడ్డి కొట్టెం రామ్మూర్తి జొన్నవాడ కోదండపాణి శ్రీనివాసులు ముంగమూరు బాలకష్ణారెడ్డి ఉన్నారు.


ఎంఎల్‌ఎకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎంఎల్‌సి ఓట్ల నమోదుకు
బిఎల్‌ఒలు అడ్డంకులు

ప్రజాశక్తి -కందుకూరు

ఎంఎల్‌సి పట్టభద్రుల ఓట్ల నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి బిఎల్‌ఒలు పరిశీలనా పేరుతో చుక్కలు చూపిస్తున్నారు. లేని నిబంధనలు చెప్పి దరఖాస్తుదారులను తికమక పెట్టి ఓట్లు నమోదు కాకుండా చూసేం దుకు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్న పరిస్థితి కందుకూంరులో జరుగుతోంది. ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న కందుకూరు పట్టణం వరపర్లవారి పాలెం కు చెందిన ఓ వ్యక్తి వద్దకు గురువారం బిఎల్ఒ వెళ్లాడు. డిగ్రీ సర్టిఫికెట్‌తోపాటు దరఖాస్తు సందర్భంగా జతచేసిన పత్రాలను బిఎల్ఒ చూపించారు. పదో తరగతి, ఇంటర్ పాస్ అయినట్లు సర్టిఫికెట్లు చూపిం చాలని బిఎల్ఒ అడగడంతో ఆయన కంగుతిన్నాడు. రెసిడెన్స్ సర్టిఫికేట్ కూడా కావాలని అడిగాడు. ఇవన్నీ ఎందుకని దరఖాస్తు దాడులు అడిగారు. ఉన్నతాధికారులు పరిశీలించమన్నారని బిఎల్ఓ సమా ధానం చెప్పారు. డిగ్రీ పాసై ఉంటే పట్టభద్రుల ఓటు నమోదు చేసు కోవ డానికి అర్హులు. బి ఎల్ ఓ దానికి పరిమితం కాకుండా ఇతర సర్టిఫికెట్లు కూడా అడగడం ఏమిటా అని ఆశ్చర్యం కలుగుతుంది.ఈ విషయం తెలుసుకున్న ప్రజాశక్తి బిఎల్ఒ ప్రశ్నించగా పై అధికారుల ఆదేశాల మేరకు అడుగుతున్నామని సమాధానం చెప్పాడు. ఓట్లు నమోదు కాకుండా అడ్డమైన ప్రశ్నలతో దరఖాస్తు దారులను తికమక పెడుతున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ కాకుండా ఉన్న వారి ఓట్ల నమోదు కాకుండా చూసేందుకు ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారనే అనుమానాలు కలుగుతున్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాలను అమలు జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

వృద్ధాశ్రమంలో మంత్రి 'కాకాణి' జన్మదిన వేడుకలు

తోటపల్లిగూడూరు మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం మండలం ఇస్కపాలెం గ్రామంలోని కపా అనాధ వదుల ఆశ్రమంలో జరిగాయి. వైసిపి మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విజయ డైరీ మాజీ చైర్మన్ చిల్లకూరు సుధీర్ రెడ్డి, ఎఎంసి డైరెక్టర్, జై ఉద్యమం జిల్లా అధ్యక్షులు మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, జెడ్పిటిసి శేషమ్మ, మాజీ జెడ్పిటిసి చిరంజీవి గౌడ్, ఎంపీటీసీ శ్రీనివాసులు, ఎంబెటీ సంధ్యారాణి తదితరులు హాజరయ్యారు. వృద్ధులకు పండ్లు, దస్తులు, ఆహారం ఆహారం పంపిణీ చేశారు. తొలుత ఎంపిపి స్వర్ణలత, వైసిపి నాయకులు గూడూరు విష్ణు మోహన్ రెడ్డి మంత్రి గోవర్ధన్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛమ్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


తోటపల్లిగూడూరులో..

నెల్లూరు : మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి పార్టీ ఎంఎల్‌ఎలు, పలువురు పలువురు జిల్లా అధికారులు శుభాకంక్షలు తెలిపారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ హరిత, నగర, రూరల్ శాసనసభ్యులు పి.అనిల్‌కుమార్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వైసిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అత్యవర చికిత్సలపై అవగాహన

ప్రజాశక్తి-కావలి

ప్రతి ఎన్‌సిసి కేడేట్ విపత్తు నిర్వహణ, ప్రాథమిక చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని రెడ్ క్రాస్ విపత్తు నిర్వహణ శిక్షకులు డాక్టర్ కె.మాధవరెడ్డి పేర్కొన్నారు. ముసునూరులోని ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్లో నిర్వహిస్తున్న ఎన్‌సిసి కంబైన్డ్ మాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణ, ప్రాథమిక చికిత్సలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవరెడ్డి మానవశరీరంలోని ముఖ్యభాగాలను తెలియజేసే మానవ కంకాళం ఇతర ముఖ్య భాగాలను ప్రదర్శించారు. కేడేట్లు ఆపత్కాల పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో ప్రయోగపూర్వకంగా వివరించారు. కార్డియాక్ అరెస్ట్ జరిగినప్పుడు రక్తప్రసరణను కొనసాగించే సిపిఆర్ విధానాన్ని కేడేట్ల చేత చేయించారు. అత్యవసర పరిస్థితులలో వైద్యసిబ్బంది లేదా 108 వాహనం వచ్చే లోపే ప్రాణాలను కాపాడే విధానాలను వివరించారు. ఈ సందర్భంగా క్యాంప్ కమాండెంట్ కల్నల్ ప్రవీణ్ కుమార్ పాండే డాక్టర్ మాధవరెడ్డిని ఘనంగా సత్కరించారు. అత్యవసర వైద్యవిధానాలను సులభతరంగా వివరించినందుకు అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ సునీల్ కుమార్, సుబేదార్ మేజర్ రాజేష్, ఎన్‌సిసి అధికారులూ బాలబ్రహ్మాచారి, షరీఫ్, మోహన్ రెడ్డి, ప్రసాద్, రెడ్ క్రాస్ సిబ్బంది పద్మావతి, మదుసూధన్ రెడ్డి, మిలటరీ సిబ్బంది పాల్గొన్నారు.



సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులోని ఎరుకుల సానినగర్ ప్రాంతంలో సిమెంట్ రోడ్డుకు ఏర్పడిన గుంతల కారణంగా అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్న విషయాన్ని వార్డు ప్రజల ద్వారా తెలుసుకొన్న ఆత్మకూరు 20వ వార్డు కౌన్సిలర్ సూరా బాస్కర్ రెడ్డి తన సొంత నిధులతో సిమెంట్ రోడ్డును మరమ్మతులు చేయిం చారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ సురా భాస్కర్ రెడ్డి మాట్లా డుతూ తన వార్డులోని చిన్న చిన్న సమస్యలకు మున్సిపాల్టీ నుండి నిధులు రాకపోయినా తన సొంత ఖర్చులతో వీటిని పూర్తి చేస్తున్నానని, తన వార్డులో నెలకొన్న సమస్యలన్నీటికి తన శక్తి మేరకు సరి చేస్తానని వార్డు కౌన్సిలర్ తెలిపారు. తాము ప్రధానంగా ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యను తమ వార్డు కౌన్సిలర్ సొంత నిధులతో పూర్తి చేయడంపై 20వ వార్డులోని ఆ వీధి వాసులు హర్షం వ్యక్త పరిచారు.



ప్రత్యేక హోదా అడగాలి టిడిపి

ప్రజాశక్తి-ఉదయగిరి

ప్రత్యేక హోదా అడిగి ఆంధ్ర రాష్ట్ర ప్రజల పక్షాన రాష్ట్ర ముఖ్యమంత్రి నిలవాలని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మాజీ జెడ్‌పి చైర్మన్ చెంచలబాబు యాదవ్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ11న విశాఖపట్నం పర్యటన సందర్భంగా వస్తున్న దేశ ప్రధానిని వైసీపీ నాయకులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వమని కోరాలని డిమాండ్ చేయాలన్నారు. ప్రధానమంత్రిని అడిగే సత్తా వైసీపీ నాయకులకు ఉందా అని ప్రశ్నిస్తున్నామన్నారు. ఉంటే రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోను, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ చేయొద్దని, విభజన హామీలను అమలు చేయాలని ప్రధానమంత్రి వద్ద డిమాండ్ చేయాలన్నారు. 2019 ఎన్నికలలో వైసీపీని గెలిపిస్తే 25 మంది పార్లమెంటు సభ్యులను గెలిపిస్తే కేంద్ర మెడ వంచైనా రాష్ట్రానికి ప్రత్యేక హెూదా తీసుకువస్తామని చెప్పిన ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వానికి దాసోహం అయ్యారని మండిపడ్డారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి రాష్ట్ర అభివద్ధిపై చిత్తశుద్ధి ఉంటే వెంటనే రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హోదా విశాఖ రైల్వే జోన్ కడప స్టీల్ ప్లాంట్ విభజన హామీలను వెంటనే అమలు చేయాలని, కేంద్రంపై ఒత్తిడి చేయాలని ధ్వజమెత్తారు.


చెంచలబాబు యాదవ్

పట్టణాన్ని అభివృద్ధి చేస్తా

ప్రజాశక్తి-ఉదయగిరి

పట్టణ అభివద్ధి సహకరిస్తే అభివద్ధిని చేసి చూపిస్తాని ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. గురువారం స్థానిక బస్టాండ్ సెంటర్లో ఆయన పంచాయతీ కార్యదర్శి ఆర్ నరసయ్య ఉపసర్పంచ్ ముర్తుజా హుస్సేన్‌తో బస్టాండ్ సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో జాతీయ రహదారి నూతనంగా నిర్మించబోతున్న సందర్భంగా దానికి అనుసంధానంగా పట్టణంలోని గండిపాలెం, సీతారాంపురం మార్గం వైపు ఉండే రోడ్లు వెడల్పుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అందుకు దుకాణ యాజమానులు, పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. దాంతో పట్టణం మరింత అభివద్ధి చెందుతుందని సర్వే చేపట్టే అధికారులకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే అధికారులు నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అక్కి భాస్కర్ రెడ్డి, సర్పంచ్ గౌస్ మొహద్దీన్, మాజీ సర్పంచ్ ఓబుల్ రెడ్డి, తదితర వైసిపి నాయకులు, దుకాణ యాజమానులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ

అక్షర చైతన్యంపై అవగాహన

ప్రజాశక్తి-ఉదయగిరి

కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఎంపిడిఒ ఐజాక్ ప్రవీణ్ అడల్ట్ ఎడ్యుకేషన్ సూపర్‌వైజర్ షేక్. బాదుల్లా అధ్యక్షతన అక్షర చైతన్యం -2 కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని అన్ని సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, మహిళా శిశు సంక్షేమ కార్యదర్శిలకు సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ వాలంటరీలు నిరక్షరాస్యులను గుర్తించి కార్యాచరణ ప్రాణాలిక తయారుచేసుకొని అందరినీ 100శాతం అక్షరాస్యులుగా తయారు చేయాలన్నారు. అనంతరం ఇఒపిఆర్‌డి మల్లికార్జున వెల్ఫేర్ అసిస్టెంట్లకు, మహిళా పోలీసులకు అక్షర చైతన్యం - 2 గురించి దిశా నిర్దేశం చేశారు. గతంలో సీతారాంపురం మండలంలో జరిగిన అక్షర చైతన్యం ఫేస్-1లో మండలంలో చాలామందిని అక్షరాస్యులుగా చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా పొదుపు మహిళలు, ఉపాధిహామీ కూలీలు అందరూ ఈ కార్యక్రమములలో సంతకాలు తప్పనిసరిగా చేసేలా వాలంటరీలు వారిని ప్రోత్సహించాలన్నారు. జగనన్న పచ్చ తోరణం కార్యక్రమంలో భాగంగా ప్రతి నిరక్షరాస్యులను అక్షరాస్యులు గా మారుతూ మనిషికి ఒక మొక్క నాటి పర్యావరణం కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ సిహెచ్ రేణుక, సీనియర్ సహా యకులు గోపి, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు మహిళా పోలీసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ

పెన్నా పరివాహక భూములపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - ఆత్మకూరు అర్బన్

- పేజర్ల మండలం పెల్లేరు గ్రామ దళితుల భూముల పై న్యాయ విచారణ జరిపించాలని బహుజన సమాజ్ పార్టీ స్టేట్ జనరల్ సెక్రటరీ జానకి ప్రసాద్‌గురువారం ఆత్మకూరు పట్టణంలోని ఆర్టీవో కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్య.కాసం. జిల్లా కార్యదర్శి ఎం.పుల్లయ్య మద్దతు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు గంటా లక్ష్మీపతి, సిఐటియు మండల నాయకులు ఆత్మకూరు నాగయ్య , సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు , ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి లక్కు ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతన్న వ్య.కా.స. జిల్లా కార్యదర్శి పుల్లయ్య

పలుచోట్ల గడప గడపకు మన ప్రభుత్వం


అల్లూరులో

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని చవటపాలెం గ్రామంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి గడప గడప కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆయన రాకను ప్రజలు స్వాగతించి పూల వర్షం కురిపించి మంగళ హారతులు పట్టారు.ప్రతి ఇంటి వద్దకు ఆయన వెళ్లి ప్రభుత్వ పథకాలు ఎలా అమలవు తున్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలు మాకు అందాయని తెలియజేయడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని తెలియజేశారు. జగనన్న నిరంతరం ప్రజల కోసం తపిస్తుంటారని పేర్కొన్నారు. అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి ప్రజల చెంతకు చేరుస్తున్నారని వివరించారు. ప్రతి ఒక్కరికి వద్ధాప్య పెన్షన్లు,వితంతు, చేయూత,ఆసరా, అమ్మ ఒడి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి చెందుతుందన్నారు. జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వ్యాఖ్యానించారు. రాజారామి రెడ్డి కాలనీలో ప్రజలు ఇళ్ల సమస్యను పరిష్కరించాలని కోరగా వెంటనే పశుసంవర్ధక శాఖ జెడి కి ఫోన్ చేసి ఆ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. అవసరమైతే పశుసంవర్ధక శాఖ మంత్రితో మాట్లాడి సమస్యకు పరిష్కార మార్గం చూపుతానని హామీ ఇచ్చారు. సెటిల్మెంట్, కోళ్లపార సంఘం తదితర గ్రామా లలో ఆయన విస్తతంగా పర్యటిం చారు. అనంతరం దేవరకొండ సమూయేలు బాబు ఆధ్వర్యంలో యేసు అభిషేక మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో అల్పాహార విందును ఏర్పాటు చేయగా అందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మన్నెమాల సుకుమార్ రెడ్డి, సామంతుల సురేష్ రెడ్డి, కోడూరు సాధక్ కుమార్ రెడ్డి, ఎంపీపీ కుమారి దర్శి గుంట శశిరేఖ, తహశీల్దార్ శ్రీ రామ కష్ణ, అల్లూరు నగర పంచాయతీ కమిషనర్ ఫణి కుమార్ పాల్గొన్నారు.


కలిగిరిలో

కలిగిరిలో

మండలంలోని చిన్న అన్నలూరు గ్రామ సచివాలయం పరిధిలో గురువారం నాడు ఉదయగిరి శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం ప్రక్రియను నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి గ్రామంలోని నివాసాల వద్దకు స్వయంగా వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.కార్యక్రమంలోఎమ్మెల్యే మేకపాటి వెంట జెడ్ పి టి సి సభ్యులు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి,సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి,పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, గ్రామ సచివాలయాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సంగంలో

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు వివరించి..వారి నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గడప గడప లో పలువురు విద్యార్థులు తమ హై స్కూల్ శిథిలావస్థకు చేరి వర్షం వచ్చినప్పుడు ఉరుస్తుందని ఎమ్మెల్యే దష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే వెంటనే అక్కడే ఉన్న ఎంఈఓ తో మాట్లాడగా పాఠశాలలో అదనపు తరగతి గదులకు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు.వెంటనే కలెక్టర్ తో మాట్లాడి త్వరితగతిన పనులు ప్రారంభమయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని విద్యార్థులకు తెలియచేయడం తో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు.గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి వచ్చిన సమస్యలపై రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా శాఖల వారీగా ప్రజలు తెలిపిన సమస్యలపై ఆయా శాఖల అధికారులతో చర్చించి ఎంత సమయంలోపు పరిష్కరించగలరో ప్రజలకు తెలియచేసి వాటిని పరిష్కరించి నివేదిక అందచేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మీరమ్మ, జెడ్పీటీసీ రావుల లక్ష్మీ,తహసీల్దార్ జయ వర్ధన్,ఎంపీడీఓ గోపి, వైసీపీ నాయకులు రఘునాథ్ రెడ్డి,ప్రసాద్ రెడ్డి,మల్లికార్జున, కరీముల్లా,జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

దత్తతకు వేగూరు గ్రామం

ప్రజాశక్తి-కోవూరు

మండలంలోని వేగూరు గ్రామం పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డికి గ్రామంలో వైసీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మీరు ఇరువురు కలిసి గడపగడపకు వెళ్లి లబ్ధిదారులు అందుకున్న సంక్షేమ పథకాలు వివరాలు తెలుసుకుంటూ, సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారుల సమస్యల పరిష్కరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చాలా గొప్పదని, ప్రజలకు ప్రజాప్రతినిధులకు మధ్య తత్సంబంధాలు మరింత బలోపేతం చేస్తున్నాయని, ఇలాంటి గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీఎం జగన్మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.ఇప్పటివరకు 31 సచివాలయ పరిధిలో 31274 గహాలను ఎమ్మెల్యే ప్రసన్న సందర్శించారని తెలిపారు. వేగురు గ్రామంలో 22 కోట్ల 24 లక్షల రూపాయల సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిని మునుపటి మెజారిటీ కంటే భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. అనంతరం ఎమ్మెల్యే ప్రసన్న మాట్లాడుతూ వైయస్సార్ తమ్ముడు, అందరూ బాగుండాలి అని కోరుకునే మంచి మనసున్న మహారాజు మన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఎంపీ నిధుల నుంచి మన కోవూరు నియోజకవర్గానికి రెండు కోట్ల 50 లక్షలు నిధులు ఇచ్చారని అంతేకాకుండా జిల్లా అంతట ఎంపీ నిధుల నుంచి ఆర్.ఓ ప్లాంట్లను నిర్మించారని తెలిపారు. గ్రామానికి మంజూరైన 40 లక్షల నిధులతో స్మశానం వాటిక పనులు పూర్తయ్యాయని తెలిపారు. అంతేకాకుండా వేగూరు గ్రామ ప్రజలు గత 25 సంవత్సరాల నుంచి అల్లూరు సబ్ స్టేషన్ నుంచి వస్తున్న సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరాతో ఇబ్బందులు పడుతున్నారని, విద్యుత్ ఆధునికరణలో భాగంగా కోటి 50 లక్షలు నిధులతో త్రీఫేస్ విద్యుత్ లైన్లతో ఇనుమడుగు సబ్ స్టేషన్ నుంచి రైతులకు వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నామని తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పల్లిపాడు గ్రామంలోను దత్తత తీసుకుని దాదాపు రెండు కోట్లతో అభివద్ధి చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతూ, ఎమ్మెల్యే ప్రసన్న, వేగూరు గ్రామ ప్రజలు వేగురు గ్రామాన్ని దత్తత తీసుకోవాలని కోరారు. వెంటనే వాళ్ళ అభ్యర్ధనలకు స్పందించి ఎంపీ ప్రభాకర్ రెడ్డి వేగూరు గ్రామాన్ని దత్తత తీసుకున్నానని ప్రకటించి, 25 లక్షల రూపాయలను గ్రామ అభివద్ధి కోసం ఎంపీ నిధుల నుంచి ప్రకటించారు. అనంతరం వేగూరు చెందిన కరిష్మా అనే మహిళకు ఎంఎస్ఆర్ ట్రస్ట్ నుంచి కుట్టు మిషన్ అందజేశారు. తదుపరి పొదుపు మహిళా సంఘాలకు సున్నా వడ్డీతో మంజూరైన 23 లక్షలు చెక్కులను గ్రూపులకు అందజేశారు. కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్ బాబు రెడ్డి డీసీఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకష్ణారెడ్డి జడ్పిటిసి సభ్యురాలు కవరిగిరి శ్రీలత ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి ఎంపీడీవో శ్రీహరి తహశీల్దార్ పద్మజ వైసిపి నాయకులు టి. చంద్రశేఖర్ తోడేటి మహేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ప్రతికుటుంబానికీ సంక్షేమ ఫలాలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

కరటంపాడు సచివాలయం పరిధిలో ప్రతి కుటుంబానికీ ఫలాలు అందే విధంగా ఉద్యోగులు కషి చేయాలని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కరటంపాడు గ్రామ సచివాలయంలో గడపగడపకు మన ప్రభుత్వం రివ్యూ మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి తెలిపిన విధంగా సమస్యలను చర్చించారు. ప్రతి సమస్యను అందరూ పరిష్కారాలకు మార్గాలు చూసుకున్నారు అవన్నీ డిసెంబర్‌లో ఎమ్మెల్యే గడపగడపకు గల ప్రభుత్వం కార్యక్రమంలో రావడం జరుగుతుందని తెలిపారు. ఈ లోపు సమస్యలన్నీ సరిచేసి సమస్యలన్నీ పరిష్కరించాలని కోరుతున్నా మన్నారు. ఇంకా ఏమైనా పెద్ద సమస్యలు ఉంటే ఎమ్మెల్యే గారు వచ్చినప్పుడు ఆ సమస్యలను పరిష్కరిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు వల్లభనేని రాజేంద్రనాయుడు , ఎంపీడీవో శ్రీనివాసులు , తహశీల్దార్ లక్ష్మీ నరసింహ, విద్యుత్ ఎఇ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిపి కేతా

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-ఉదయగిరి

జీవశాస్త్ర ఉపాధ్యాయులు ఔదార్యముతో పదవ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహకలు అందజేత. గురువారం మండల పరిధిలోని అప్పసముద్రం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్రధానోపా ధ్యాయులు వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులు చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ నిర్మాణాత్మక మదింపు -1లో పదవ తరగతిలో వరుసగా ప్రథమ,ద్వితీయ,తతీయ స్థాయిలను సాధించిన విద్యార్థులకు జీవశాస్త్ర ఉపాధ్యాయులు ఔదార్యంతో ప్రోత్సాహక బహుమతులు అందజేశామన్నారు. విద్యార్థులు శాఖ బహుమతులను ఉన్నత శిఖరాలు అవరోధించేందుకు ఆదర్శంగా తీసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బందం విద్యార్థులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలన

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలం పడమటి నాయుడు పల్లిలో గురువారం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సురేఖ దేవి, ఆత్మ డి పి డి శివన్నారాయణ మిరప బొప్పాయి పంటలను పరిశీలించారు. మిరపలో రసం పీల్చు పురుగులు వలన కలిగే నష్టా లు ,వైరస్ తెగుళ్ల వాటి ఉధతి గురించి వివరించారు. ఇందులో భాగంగా పసుపు, తెలుపు, నీలం జిగురు అట్టలను వాడటం ద్వారా రసం పీల్చు పురుగులయిన పేను బంక, తామర పురుగు,తెల్ల దోమ,పచ్చ దోమ పురుగులను నివారించవచ్చున్నారు.కార్యక్రమంలో ఏ డి ఏ బాలాజీ నాయక్, వ్యవసాయ అధికారి రామ్మోహన్ ,శ్రీధర్ రెడ్డి ,వి ఏ ఏ ప్రశాంతి గ్రామ రైతులు పాల్గొన్నారు

సచివాలయాల్లో జెసి తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాళెం

మండలంలోని దామరమడుగు-1,2 సచివాలయాలను నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.సచివాలయంలో పలు రికార్డులను పరిశీలించారు.ఇళ్ల నిర్మాణాలు, పెన్షన్ల పంపిణీ, ఇతర సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.మండలంలో జరుగుతున్న భూమి రీసర్వే గురించి రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి కలిగించాలి

ప్రజాశక్తి-బిట్రగుంట

విద్యార్థులలో సైన్స్ పై ఆసక్తి కలిగించేలా ఉపాధ్యాయులు చూడాలని గుంటూరు ప్రాంతీయ సంచారకులు సుబ్బారావు పేర్కొన్నారు. బోగోలు మండలం పాత బిట్రగుంట గ్రామంలో ఉన్న జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అటల్ టింకరింగ్ ల్యాబ్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని 32 పాఠశాలల్లోని నోడల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాంతీయ సంచారకులు సుబ్బారావు మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులకు చిన్నతనం నుండే సైన్స్ పై ఆసక్తి కల్పించి వారికి మంచి బోధనను అందించాలని , జిల్లాలో ఉన్న అన్నిపాఠశాలలోని ల్యాబ్ ను క్రమం తప్పకుండా నిర్వహించి విద్యార్థులచే ప్రాజెక్టు తయారు చేసి జిల్లాను ,రాష్ట్రస్థాయిలో ముందుండే విధంగా నోడల్స్ ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు గంగాధర్ ,జిల్లా సైన్స్ అధికారి జి శ్రీనివాసులు ,మండల విద్యాశాఖ అధికారి జయంత్ బాబు ,జిల్లా రిసోర్స్ పర్సన్స్ కళ్యాణ్, తిరుమలేష్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



నాడు- నేడు పనులు పరిశీలన

ప్రజాశక్తి-సంగం

క్వాలిటీ కంట్రోల్ అధికారి కె సూర్య నారాయణ తనిఖీ చేశారు.పనుల్లో నాణ్యతను పరిశీలించారు.పనులు జరుగుతున్న తీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం నాడు నేడు పనులకు సంబందించిన రికార్డులు పరిశీలించారు.పనుల్లో రాజీ లేకుండా నాణ్యత తో చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంఇఒ జానకీ రామ్,హెడ్ మాస్టర్ మాల్యాద్రి,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు ప్రారంభం

ప్రజాశక్తి-సంగం

మండలం తలుపురుపాడు గ్రామం లో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి వాటర్ ప్లాంట్ ప్రారంభ కార్యక్రమం లో పాల్గొన్నారు.ముందుగా వైసీపీ నాయకులు కరిముల్లా అధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి కి ఘన స్వాగతం పలికారు.అనంతరం నూతనంగా నిర్మించిన వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామం లో తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రావుల లక్ష్మీ,ఎంపిటిసి నూర్జహాన్ శివ కుమార్ రెడ్డి, ఎంపీడీఓ గోపి,తహశీల్దార్ జయవర్ధన్ ,వైసీపీ నాయకులు రఘునాథ్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి,చంద్రా రెడ్డి,బాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ప్లాంటును ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

ఆటల పోటీలు

ప్రజాశక్తి-కావలి


డాక్టర్ డి.ఆర్. విశ్వోదయ బాలల దినోత్సవ సాంస్కృతిక ఆటలపోటీలు విశ్వోదయ రెక్టర్ దొడ్లవినయ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో, డాక్టర్ "రామ్ సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక జవహర్ భారతి కళాశాల ఎం. ఎం. హాల్ లోగురువారం డాక్టర్"ఉమాచంద్, "మాధురి దంపతులు ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, తెలుగు, ఇంగ్లీష్ లలో పద్యాలు, రెయిమ్స్, పోటీలు వేడుకగా జరిగాయి.మధ్యాహ్నం పాటల పోటీలు జరిపారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, 22సంవత్సరాలుగా బాలల దినోత్సవ సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తుండడం వల్ల పండుగ వాతావరణం ఏర్పడుతుందన్నారు.విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించడానికి ఈ ఆటల, సాంస్కృతిక పోటీలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్"రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ఆర్గనైజర్ జ్యోతిశ్రీ, న్యాయ నిర్ణేతలుగా తెలుగు అధ్యాపకులు నారాయణరావు, నల్లూరి రామకష్ణ, లక్ష్మి ప్రశాంతి పాల్గొన్నారు. శుక్రవారం వక్తత్వం,ఏక పాత్రభినయం పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ప్రజాశక్తి-కావలి

కావలి నియోజకవర్గ జనసేన ఎంపీటీసీ గా పోటీచేసి చనిపోయిన బలికిరి ప్రణయ కుమార్‌కు సంబంధించిన వీడియోస్ ట్విట్టర్ లో ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసినవి,సోషల్ మీడియాలో హల్చల్ చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ మాట్లాడారు.. ఈ మధ్య మంగళగిరి పార్టీ ఆఫీస్ లో కావలి రూరల్ తుమ్మలపెంట బిట్ -1 లో జనసేన ఎంపీటీసీ గా పోటీచేసిన బలికిరి ప్రణయ కుమార్ వాళ్ల అమ్మ చనిపోయిన క్రియాశీల కార్యకర్తకు పార్టీ తరఫున 5లక్షలు పవన్ కళ్యాణ్ ఇస్తున్న సందర్భంగా ఆవిడ ఎలక్షన్స్ టైమ్ లో ప్రణయ చేసిన వీడియో చూపిస్తూ ఆ తల్లి మా అబ్బాయిని ఆ పోటీ నుండి తప్పుకోవాలని అనేక విధాల సుకుమార్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ మనుషులు వచ్చి భయభ్రాంతులకు గురిచేశారు.



మేకపాటిని కలిసిన కావలి ఎంఎల్ఎ

ప్రజాశక్తి-ఉదయగిరి

ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కలిశారు. గురువారం స్థానిక వైసీపీ క్యాంపు కార్యాలయంలో ఉదయగిరి ఎమ్మెల్యేను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కలిశారు. అనంతరం పలు అంశాలపై సుదీర్ఘ చర్చలు చేశారు. అనంతరంఉదయగిరి సెబ్ కార్యాలయ అధికారి ఎం.రవీంద్రబాబు బాధ్యతలు చేపట్టి ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముర్తుజా హుస్సేన్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-మర్రిపాడు

నెల్లూరు ముంబై జాతీయ రహదారిపై పొం గూరు కండ్రిగ నందవరం మార్గమధ్యలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. నెల్లూరు నుండి కడప వైపు వెళ్తున్న కారుకు గేదె అడ్డురావడంతో తప్పించబోయి గేదె ను డీ కొట్టి రోడ్డు ప్రక్కన బోల్తా పడింది. కారులో ఎయిర్ బెలూన్ ఓపెన్ కావడంతో కారులో ప్రయాణి స్తున్న ఆరుగురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

ఉత్తర క్రియలకు ఎంఎల్ఎ హాజరు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి బావ, విద్యుత్ ఉద్యోగి కలికి రవీంద్రనాథ్ రెడ్డి ఇటీవల మతి చెందడంతో వారి ఉత్తరక్రియలకు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలికి రవీంద్రనాథ్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట సిండికేట్ ఫార్మర్ సొసైటీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ వైఎస్ చైర్మెన్ డా.కె వి శ్రావణ్ కుమార్. వైసిపి నాయకులు ఉన్నారు.

16నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-మర్రిపాడుజిల్లా గ్రంథాలయ సంస్థ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నవంబర్ 16 నుండి 17వ తేదీ వరకు 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఇన్చార్జి గ్రంథాలయా ధికారి డి నారాయణరావు తెలియజేశారు. ఈ వారోత్సవాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని 6 నుండి 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించనున్న ట్లు పేర్కొన్నారు. విజేతలకు 23వ తేదీ ఉదయం 11 గంటలకు బహుమతి ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ఈ వారోత్సవాలలో పలువురు పాల్గొని సహకారాన్ని అందించాలని కోరారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

నెల్లూరు :నగరంలోని టూరిజం శాఖకు చెందిన హరితా హోటల్‌కు ఎదురుగా జరిగిన హత్య పథకం ప్రకారమే నిర్వహించారని నగర ఇన్‌చార్జి డిఎస్‌పి ఎస్‌కె సుభాను పేర్కొన్నారు. గురువారం దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ హత్య కేసు వివరాలనువెల్లడించారు. గత నెల 31వ తేదిన నగరంలోని హరితా హోటల్ ఎదురుగా జరిగిన ఘటనపై మృతి చెందిన అందె గిరీష్‌కుమార్ భార్య రాయపు స్వాతిశ్రీ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాచరు. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం బూదానం టోల్ ప్లాజా సమీపంలోని జెజెజె డాబా హోటల్లో తలదాచుకొని ఉన్న 13 మంది నిందితులను అరెస్టు చేశారు. వేదాయపాళెం, వెంకటరెడ్డినగర్ ప్రాంతానికి చెందిన అందే గిరీష్‌కుమార్, కొండి శెట్టి జగదీష్, దొడ్డవరం రంజిత్ ముగ్గురూ స్నేహితులు. గిరీష్‌కుమార్‌పై దర్గామిట్ట పిఎస్‌లో కొండిశెట్టి జగదీష్, దొడ్డవరం రంజిత్ ఇద్దరిపై వేదాయపాళెం, చిన్నబజారు పోలీసు స్టేషన్లల్లో రౌడీషిట్స్ ఉన్నాయన్నారు. వీరి మధ్య విబేదాలు తలెత్తడంతో ఒకరిపై మరొకరు కక్షపూరితంగా వ్యవరిస్తుండే వారు. ఈ క్రమంలో అదె గిరీష్‌కుమార్ , స్నేహితుడు ఇమ్రాన్‌తో కలిసి ఆటోలో ఇంటికి వెళ్తున్న సమయంలో పాతకక్షలు మనస్సులో పెట్టుకొని దొడ్డవరం రంజిత్, నిమ్మల శ్రీకాంత్, అలహరి ధనుష్, దాసరి నితీష్‌కుమార్ (సన్నీ) జోగి వినయ్, షేక్ కాలేషాలు ఆటోను అడ్డగించి హత్య చేసి పారిపోయారు. ఈ నేపథ్యంలో వారిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు.

In The Court of The Junior Civil Judge : Sullurupet
O.S.No. 93 / 2019

1. **Chinthapudi Venkataramaiah**
2. **Chinthapudi Padmavathi @ Padmamma** - Plaintiffs

Vs

1. **K. Rajendra**
2. **K. Peinamma** - Defendants

Notice

To,
D1. **K. Rajendra,** S/o **Ramaiah,**
D2. **K. Peinamma,** W/o **Rajendra,**
Both are residing at C/o Mutluri Padmamma, W/o Late Nageswara Rao, Door No. 27-1-796, Arundhatipalem, Mulapeta, Dargamitta, Nellore, SPSR Nellore District.

పై నెంబరున వాదులు చి॥ సిహెచ్.అవినాష్ (మైనర్) తమ దత్తపుత్రుడు / సహజ పుత్రుడుగా తీర్మానం చేయమని కోరుతూ పై తెలిపిన కోర్టు లో మీ వగైరాలపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే16-11-2022ది**కి వాయిదా వేసియు న్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

పి.ఝాన్సీ, బి.కాం., ఎం.ఎల్.,
బి. బాలప్రదీప్, ఎం.బి.ఎ., ఎల్.ఎల్.బి.,
వాదుల తరపు అడ్వకేట్స్, నెల్లూరు.

In the Court of the 1st Addl. Senior Civil Judge : Nellore
I.A.No. 315 / 2022
O.S.No. 574 / 2014

Mangadu Ravi Kumar - Petitioner / Plaintiff

Vs

1. **Gumma Kanthamma**
1. **Gumma Srinivasulu** - Respondents / Defendants

Notice

To,
R1. **Gumma Kanthamma,**
W/o Late **Krishnaiah,**
R2. **Gumma Srinivasulu,**
S/o Late **Krishnaiah,**
Both are residents of 11/397, Thukumanumitta, Santhapeta, Nellore.

పై నెంబరున పిటిషనరు / వాది మీ నుండి ఫైనల్ డిక్రీ కోరుతూ పై తెలిపిన కోర్టులో మీ వగైరాలపై పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో మీకు నోటీసు నిమిత్తం **తే23-11-2022ది**కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎన్.సుధీర్ రెడ్డి, బి.కాం., బి.ఎల్.,
పిటిషనరు / వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.